సాక్షి
ఖమ్మం
మంగళవారం, 25, ఏప్రిల్, 2023



మొరాయిస్తున్న పాలేరు గేట్లు
పాలేరు రిజర్వాయర్ గేట్ల వద్ద ఎదురవుతున్న సమస్యలతో దిగువకు నీరు నిలిపేసినా వృథాగా పోతోంది. 8లో



మృత్యువులోనూ వీడని స్నేహం
ఒకరి కోసం ఒకరు అన్నట్లు జీవిస్తున్న స్నేహితులిద్దరు ఒకే ఘటనలో మృతి చెందడం రెండుకుటుంబాల్లో విషాదాన్ని నింపింది. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 24°

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఉదయం వాతావరణం కాస్త చల్లగానే ఉంటుంది. ఆతర్వాత ఎండ మొదలవుతుంది.

న్యూస్‌రీల్

30న 'సీతారామ'పై సమీక్ష

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వచ్చే మూడు నెలల్లో సత్తుపల్లి నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా నీళ్లు ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కల్లూరులో జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సభలో ప్రకటించారు. ఈమేరకు 30వ తేదీన ప్రాజెక్టు పనులపై హైదరాబాద్‌లో సమీక్షించనున్నట్లు అధికారులకు సమాచారం ఇచ్చారు. సత్తుపల్లికి నీరు అందించే మెయిన్ కెనాల్, యాతాలకుంట టన్నెల్ పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. అలాగే పాలేరుకు నీరు చేరవేసే టన్నెల్ నిర్మాణ పనులకు కూడా ప్రభుత్వం అనుమతించింది. ఈ పనులపై మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పలుమార్లు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లగా.. గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అందించే క్రమంలోకొద్దిమేర పనులు పూర్తయితే సత్తుపల్లి నియోజకవర్గానికి నీరు అందుతాయనే ఉద్దేశంతో పనులను వేగిరం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. వచ్చే వానాకాలం సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ మూడు నెలల్లో చేపట్టాల్సిన పనులపై 30వ తేదీన హైదరాబాద్‌లో సమీక్ష ఏర్పాటుచేసినట్లు తెలుస్తోంది.

విద్యుత్ ఉద్యోగుల సమ్మెపై నిషేధం..

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ ఉద్యోగుల సమ్మెపై నిషేధం ఉందని, ఎవరైనా సమ్మెలోకి వెళ్తే చట్టరీత్యా నేరంగా పరిగణిస్తామని ఎన్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్మా 1971 యాక్ట్ పరిధిలోకి విద్యుత్ సంస్థలు వస్తాయని, ఎన్పీడీసీఎల్ పరిధిలోని జిల్లాల్లో ఏ ఉద్యోగి సమ్మెకు దిగొద్దని సూచించారు. ఉద్యోగుల డిమాండ్లపై యాజమాన్యం సానుకూలంగా ఉన్నా కొందరు సమ్మెకు వెళ్తుండడంతో ఇప్పటికే ఖమ్మం, జనగామ, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో ఆర్టిజన్లకు అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఆస్పత్రి నిర్మాణ పనుల్లో వేగం పెంచండి



పనులపై సమీక్షిస్తున్న జాయింట్ కమిషనర్ రమేష్‌కుమార్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలో రూ.35 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల ఏరియా ఆస్పత్రి పనుల్లో వేగం పెంచాలని వైద్య విధాన పరిషత్ జాయింట్ కమిషనర్ డాక్టర్ రమేష్‌కుమార్ ఆదేశించారు. జిల్లా మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లుతో కలిసి ఆస్పత్రి పనులను పరిశీలించిన ఆయన మాట్లాడారు. చికిత్స కోసం వచ్చే వారు ఇబ్బంది పడకుండా ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సత్తుపల్లి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డాక్టర్ లూనావత్ భాస్కర్‌నాయక్, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



మాట్లాడుతున్న చావా రవి

మధిర: వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి ప్రభుత్వాన్ని కోరారు. మధిరలోని సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 317 జీఓ కారణంగా ఉత్పన్నమైన అన్ని సమస్యలతో పాటు పండిట్, పీఈటీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే, బదిలీలు, పదోన్నతులపై దృష్టి సారించి వేసవి సెలవుల్లో పూర్తిచేయాలన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావుతో పాటు షేక్ నాగూర్ వలీ, ఏ.వినోద్‌రావు, బి.నాగరాజు, ఆర్.లక్ష్మణరావు, వీరయ్య, సీహెచ్.సాధు సమాధానం తదితరులు పాల్గొన్నారు.

తరగతులు నిర్వహిస్తే చర్యలు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు మంగళవారం నుంచి రాష్ట్రప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించిందని డీఈఓ సోమశేఖరశర్మ వెల్లడించారు. ఈ సెలవులను అన్ని పాఠశాలల యాజమాన్యాలు పాటించాలని, ఎవరైనా తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, మన ఊరు - మన బడి కింద ఎంపికైన పాఠశాలల హెచ్‌ఎంలు సామగ్రి పంపిణీ ఇతర అవసరాలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

కేసీఆరే మాకు అద్భుత దీపం



సభలో అభివాదం చేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్, ఎంపీలు నామా, రవిచంద్ర, పార్థసారధిరెడ్డి, ఎమ్మెల్యే సండ్ర, మాజీ మంత్రి తుమ్మల తదితరులు

ఎవరెన్ని ట్రిక్కులు చేసినా హ్యాట్రిక్ సీఎం ఆయనే..
- ఖమ్మం జిల్లాపై కేసీఆర్‌కు అమితమైన ప్రేమ
- కల్లూరు ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సత్తుపల్లి/కల్లూరురూరల్: 'తెలంగాణ ఏర్పడిన తొలినాళ్లల్లో యాసంగిలో 14 లక్షల ఎకరాల్లో సాగు చేస్తే.. ఈ ఏడాది 56 లక్షల ఎకరాల్లో వరి పండింది.. ఇదంతా మంత్రం వేస్తే జరగలేదు.. అద్భుత దీపం లాంటి సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న రైతు బంధు, మిషన్ కాకతీయ, ప్రాజెక్టులు, విద్యుత్ సరఫరాతోనే సాధ్యమైంది' అని రాష్ట్ర ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. జిల్లాలోని కల్లూరులో సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అధ్యక్షతన ఏర్పాటుచేసిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు కరువు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ ఇప్పుడు దేశంలోనే అత్యధిక ధాన్యం పండిస్తున్న రాష్ట్రంగా ఎదిగిందని, కేంద్రం ధాన్యం కొనుగోలు చేయకపోయినా.. రైతులు పండించే ప్రతీ గింజా కొనుగోలుకు సీఎం కేసీఆర్ 7,100 కేంద్రాలను ఏర్పాటు చేయించారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో వ్యవసాయ భూముల విలువ గ్రామాల్లోనూ ఎకరాకు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు పలుకుతోందని మంత్రి వెల్లడించారు.

కాంగ్రెస్ పార్టీ వస్తే..
కాంగ్రెస్ హయాంలో ఎరువుల కోసం రైతులు చెప్పులు లైన్‌లో పెట్టినా దొరకని దుస్థితి ఉండేదని హరీశ్‌రావు అన్నారు. ఆ పార్టీ ప్రజల కోసం కాకుండా స్వార్థం, పదవుల కోసం ఆలోచిస్తుందని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఢిల్లీ పెద్దలకు గులాంగిరీ చేస్తుంటే బీఆర్‌ఎస్ మాత్రం తెలంగాణ ప్రజలకు గులాంగిరీ చేస్తోందన్నారు. భట్టి విక్రమార్క డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసినా కనీసం మధిర నియోజకవర్గంలో ఆస్పత్రి కట్టించలేకపోయారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రం వంద పడకల ఆస్పత్రిని నిర్మిస్తోందని అన్నారు. సీఎం కేసీఆర్‌కు ఖమ్మం జిల్లాపై అమితమైన ప్రేమ ఉందని.. మూడు, నాలుగు నెలల్లో ఉమ్మడి జిల్లాలోని 10లక్షల ఎకరాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు అందించడంపై దృష్టి సారించామని తెలిపారు. కాగా, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం మంత్రుల వెంట పడుతూ నిధులు మంజూరు చేయించుకుంటూ ప్రజల మనిషిగా పేరు తెచ్చుకున్నారని అభినందించారు.

చెప్పేవన్నీ మాయమాటలే : ఎంపీ నామా
పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి తెలంగాణకు రూ.1,820 కోట్లు ఇచ్చామని.. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రూ.1.20 లక్షల కోట్లు ఇచ్చామని ప్రకటించారని.. ఇందులో ఏది నిజమో చెప్పాలని ఎంపీ నామా నాగేశ్వరరావు సూచించారు. రాష్ట్రం నుంచి రూపాయి తీసుకుంటే.. పావలా కంటే తక్కువే ఇస్తున్న బీజేపీ నేతలు చెప్పేవన్నీ మాయమాటలేనని మండిపడ్డారు. రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఆత్మీయ సమ్మేళనాలతో సందడి నెలకొందన్నారు. ఇక్కడ అభివృద్ధిని చూసి అమెరికాలోని తన స్నేహితులు అబ్బురపడుతున్నారని చెప్పారు. మరో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ కల్లూరు పంచాయతీకి రూ.10 లక్షలు ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రత్యేక ప్రేమతో ఉమ్మడి జిల్లా ప్రజల కోసం రూ.15వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టును మంజూరు చేశారని, మరో మూడు, నాలుగు నెలల్లో సత్తుపల్లి మీదుగా పాలేరుకు గోదావరి జలాలు చేరతాయని తెలిపారు. సీఎం కేసీఆర్ ఎంతో ప్రేమ కనబరుస్తున్నా.. గత ఎన్నికల్లో సరిగా ఆదరించలేదని, ఈ సారైనా జిల్లాలో ఎదురులేని శక్తిగా బీఆర్‌ఎస్ నిలబడేలా ప్రజలు ఆదరించాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సంకల్పంతోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. గతంలో పాలించిన ప్రభుత్వాలు ఏం అభివృద్ధి చేశాయి.. ఇప్పుడెలా ఉందో ప్రజలు ఆలోచించి మంచి చేసే ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని కోరారు. ఇంకా ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రాష్ట్ర చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, జెడ్పీ, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు లింగాల కమల్‌రాజు, కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, కల్లూరు సర్పంచ్ లక్కినేని వీరయ్య, ఎంపీపీ బీరెల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మతాల మధ్య చిచ్చుపెడుతున్నారు..
– మంత్రి పువ్వాడ

కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టేందుకే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రకటించారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మండిపడ్డారు. బండి సంజయ్ సచివాలయం గోపురాలను, మరొకరు ప్రగతి భవన్‌ను పేల్చివేస్తామని చెబుతున్నందున ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కొందరు నిన్నటి వరకు సీఎం కేసీఆర్ గొప్ప నాయకుడని పొగిడి ఇప్పుడు తూలనాడుతున్నారని ఆరోపించారు.



సభకు హాజరైన పార్టీ శ్రేణులు, ప్రజలు

హైవే పనులు పరిశీలించిన కలెక్టర్

వేంసూరు/పెనుబల్లి/సత్తుపల్లి రూరల్: ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను వేంసూరు, పెనుబల్లి మండలాల్లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సోమవారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటిస్తూనే వేగంగా జరిగేలా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఇక సత్తుపల్లి మండలం యాతాలకుంటలో జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు టన్నెల్ పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం జగన్నాథపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీని పరిశీలించిన ఆయన కాలనీకి అంగన్‌వాడీ భవనం, పాఠశాల మంజూరైనట్లు తెలిపారు. అయితే, పొలాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం, శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా సర్వే చేయాలని అధికారులకు సూచించారు. ఇక పెనుబల్లి, వీఎం బంజర్‌ల్లో నిర్మిస్తున్న హెల్త్ సబ్ సెంటర్ల పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈకార్యక్రమాల్లో జాతీయ రహదారుల శాఖ అధికారులు దివ్య, అమరేందర్, నారాయణ, ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్లు నారాయణమూర్తి, శ్రీనివాసరావు, రమాదేవి, ఎంపీడీఓ రమేష్, సర్పంచ్ తాటి మోహన్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ మోదుగు పుల్లారావు, అధికారులు సురేష్‌కుమార్, చంద్రమౌళి చంద్రశేఖర్, మోతీలాల్, నర్సింహారావు, గఫార్‌పాషా పాల్గొన్నారు.



హైవే పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

ఫిర్యాదులు పరిష్కరించండి

గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఏ.మధుసూదన్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా ఆయన ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించాక జిల్లా అధికారులకు సూచనలు చేశారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరామ్, ఆర్డీఓ రవీంద్రనాథ్, కలెక్టరేట్ ఏఓ కారుమంచి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...
- తల్లాడ మండలం బస్వాపురానికి చెందిన శీలం బసవేశ్వరి, మధిర మండలం రొంపిమళ్లకు చెందిన తడికమళ్ల అచ్చారావు తమ వృద్ధాప్య పింఛన్ పునరుద్ధరించాలని కోరారు.
- ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల గోపాలపురానికి చెందిన దివ్యాంగుడు దేవసాని మురళి తనకు మూడు చక్రాల మోటారు వాహనం ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు.
- చింతకాని మండలం నాగులవంచ గ్రామంకు చెందిన బిళ్లకంటి సైదులు కుమారులు, కుమార్తెకు ఇవ్వగా మిగిలిన స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టగా కుమారులు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు.
- బోనకల్ మండలం ఆళ్లపాడులో మొక్కజొన్న పంట నష్టం జరగగా వివరాల నమోదులో అవకతవకలు జరిగాయని పలువురు రైతులు విన్నవించారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆళ్లపాడు రైతులు

మళ్లీ అపార నష్టం

- ఈదురుగాలులు, వడగళ్లతో పంట కోల్పోయిన రైతులు
- ప్రభుత్వానికి అధికారుల నివేదిక

ఖమ్మంవ్యవసాయం: రెండు రోజుల పాటు ఈదురుగాలులు, అకాల వర్షాలు, వడగళ్లతో కూడిన వర్షం కారణంగా పంటలకు తీరని నష్టం ఏర్పడింది. జిల్లాలోని పలుచోట్ల శుక్రవారం రాత్రే కాక ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన పడింది. దీంతో నష్టపోయిన పంటల వివరాలతో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపారు. అయితే, 33 శాతానికి పైగా పంటలకు నష్టం వాటిల్లితేనే ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుంది. కాగా, గత నెలలో జిల్లాలోని 18,258 మంది రైతులు పంట నష్టపోగా, ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం మంజూరైంది. మళ్లీ పంటలకు నష్టం జరగడంతో రైతులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

నష్టం ఇలా...
వ్యవసాయ శాఖ పరిధిలో 6,673మంది రైతులు 9,190.20 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు అధికారులు నివేదిక పంపించారు. ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, కారేపల్లి, ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, కామేపల్లి, కూసుమంచి, తల్లాడ మండలాల్లో నష్టప్రభావం ఉంది. ఆయా మండలాల్లో 774మంది రైతులు 1,361 ఎకరాల్లో మొక్కజొన్న, 5,888మంది రైతులు 7,801 ఎకరాల్లో వరి, 11మంది రైతులు 28 ఎకరాల్లో పెసర పంట నష్టపోయారు. కాగా, ముదిగొండ మండలంలో అత్యధికంగా 2,298 మంది రైతులు అన్ని పంటలు కలిపి 2,943 ఎకరాల మేర నష్టపోయినట్లు నివేదికలో పొందుపర్చారు.

ఉద్యానశాఖ పరిధిలో..
ఉద్యాన శాఖ పరిధిలోని పంటల నష్టాన్ని పరిశీలిస్తే వైరా, మధిర, ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో ప్రభావం ఉంది. ఆయా నియోజకవర్గాల్లో 376మంది రైతులు 1,316 ఎకరాల్లో మామిడి, పుచ్చకాయ, సపోటా, బొప్పాయి పంటలు నష్టపోయారు. అత్యధికంగా పాలేరు నియోజకవర్గంలో 133 మంది రైతులు 415 ఎకరాల విస్తీర్ణంలో పంట నష్టపోయారు.

ఇది తెలంగాణ నినాద గుమ్మం





సభలో మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, పక్కన మాజీ మంత్రి సంభాని, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ తదితరులు (ఇన్‌సెట్) నిరుద్యోగులు, విద్యార్థి అమరుల చిత్రపటాల వద్ద వెలిగించిన కొవ్వొత్తులు

- తొలి, మలిదశ ఉద్యమానికి ఖమ్మంలోనే పునాది
- ఇక్కడి నుంచే నిరుద్యోగ నిరసన శంఖారావం పూరించాం..
- వచ్చే ఎన్నికల్లో పదికి పది సీట్లు సాధించాలి
- నిరుద్యోగ నిరసన ర్యాలీలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం/ఖమ్మంసహకారనగర్: 'తెలంగాణ సాధన కోసం తొలిసారి 1969లో జై తెలంగాణ నినాదం వినిపించింది ఖమ్మం జిల్లాలోనే. కొత్తగూడెం థర్మల్ పవర్‌ప్లాంట్ కోసం ఆనాటి రైతులు 1,300 ఎకరాల భూములు ఇచ్చారు. కానీ ప్లాంట్‌లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వక.. ఇతర ప్రాంతాల వారికి ఇస్తున్నప్పుడు మా ఉద్యోగాలు మాకు ఇవ్వాలని రాందాస్ ఉద్యమం మొదలుపెట్టారు. ఖమ్మం గాంధీచౌక్‌లో దీక్ష చేపట్టారు. అప్పుడు రగిల్చిన నిప్పు 2009లో మలిదశ తెలంగాణ ఉద్యమానికి పునాదులు వేసింది. 2014లో తెలంగాణ ఏర్పడిందంటే ఆ ఆలోచన ఖమ్మం జిల్లా నుంచే పుట్టింది. ఈ ప్రాంతం పోరాటానికి మారు పేరు. తెలంగాణ నినాద గుమ్మం ఖమ్మం. అందుకే ఇక్కడి నుంచే నిరుద్యోగ నిరసన శంఖారావం పూరించాం' అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. నిరుద్యోగ నిరసన ర్యాలీలో భాగంగా సోమవారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియం వద్ద అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా పాత బస్టాండ్ వరకు చేరుకున్నారు. అనంతరం ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో నిరుద్యోగులు, పార్టీ శ్రేణులను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

ఇక మీ పప్పులుడకవ్...
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పప్పులు ఇక ఉడకవని కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి అన్నారు. నిరుద్యోగ నిరసన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే అందరికీ అన్నీ అందుబాటులోకి వచ్చాయన్నారు. పిల్లలు కూలీకి వెళ్లకుండా స్కూల్‌కు వెళ్లేలా చూడడంతో పాటు రేషన్ షాపుల ద్వారా పది రకాల సరుకులు ఇస్తూ మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించి చట్టసభల్లో హక్కు కల్పించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. వీటిని విస్మరించడమే కాక ప్రజలను అష్టకష్టాలు పెడుతున్న మోదీ, కేసీఆర్‌ను గద్దె దించే సమయం ఆసన్నమైందని తెలిపారు. తమ్ముడు రేవంత్‌కు అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్‌కు ఒక సీటు వచ్చిందని, ఈసారి ఆ సీటు కూడా రాకుండా చూడాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు ఇవ్వటంలో విఫలమయ్యాయని ఆరోపించారు. కేంద్రంలో మోదీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటికో ఉద్యోగం అని హామీ ఇచ్చినా నెరవేరలేదని ఆయన మండిపడ్డారు. ఆతర్వాత మాజీ మంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ నిరుద్యోగుల వెంటే తాము ఉన్నామని చెప్పేందుకు రేవంత్‌రెడ్డితో సహా ఇక్కడకు వచ్చామని తెలిపారు. రానున్న రోజుల్లో లక్షలాది మందికి ఉద్యోగాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు.

పోరాడే వారిపై కేసులు..
మహత్తర చరిత్ర ఉన్న ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీనే కాకుండా కమ్యూనిస్టులు కూడా పోడు భూములు, గిట్టుబాటు ధర, ప్రజల హక్కుల కోసం పోరాటాలు చేశారని రేవంత్ చెప్పారు. కానీ ప్రస్తుత పరిణామాల్లో కమ్యూనిస్టులు ఎవరి పక్కన నిల్చున్నారో గమనించాలన్నారు. ఖమ్మం కాంగ్రెస్ సైనికుల గుమ్మం అని, వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పది సీట్లు సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇక్కడ పోరాడే వారిపై కేసులు పెడుతున్నారని, ఖమ్మంలో ముస్తఫాపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపారని తెలిపారు. ఇంతకన్నా ఇంకేం చేయలేరని మండిపడ్డారు.

భారీగా తరలివచ్చిన జనం
టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో నిందితులపై కఠిన చర్యలు తీసుకుని నిరుద్యోగులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ ఆధ్వర్యాన చేపట్టిన నిరుద్యోగ నిరసన ర్యాలీకి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులతో పాటు నిరుద్యోగులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. సర్దార్ పటేల్ స్టేడియం నుంచి జెడ్పీసెంటర్ మీదుగా పాత బస్టాండ్ వరకు నిర్వహించిన ర్యాలీలో పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ అనుబంధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు. ర్యాలీ సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమవుతుందని ప్రకటించినా.. రేవంత్‌రెడ్డి రాత్రి ఏడు గంటలకు సర్దార్ పటేల్ స్టేడియం వద్దకు చేరుకున్నారు. గత ఎనిమిదేళ్లలో ఆత్మహత్య చేసుకున్న నిరుద్యోగులు, యువత చిత్రపటాల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కాగా, నిరుద్యోగ భృతి, టీఎస్‌పీఎస్సీ కుంభకోణం, ఇంటికో ఉద్యోగం, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర హామీలు నెరవేరలేదంటూ ర్యాలీలో కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ ర్యాలీలో కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్, మాజీ ఎంపీలు వి.హన్మంతరావు, మల్లు రవి, అంజన్‌కుమార్ యాదవ్, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్, శివసేనారెడ్డి, పీసీసీ నేత మానవతారాయ్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డితోపాటు అనిల్‌కుమార్ యాదవ్, ఎం.డీ.ముస్తఫా, రాయల నాగేశ్వరరావు, జావీద్, శివరాం, పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, పగడాల మంజుల, మొక్కా శేఖర్, సంతోష్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



ఖమ్మం పాత బస్టాండ్ వద్ద సభకు హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

మన ఊరు - మన బడిలో ముందంజ

జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర్‌శర్మ



కొణిజర్ల: లొల్లోరిగూడెం పాఠశాల చిన్నారులతో డీఈఓ, ఉపాధ్యాయులు

సత్తుపల్లిటౌన్: మన ఊరు – మన బడి పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తుండగా.. ఈ పనుల్లో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. సత్తుపల్లి పాతసెంటర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం సోమవారం హెచ్‌ఎం చిత్తలూరి ప్రసాద్ అధ్యక్షతన జరగగా, డీఈఓ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. జిల్లాలోని 110 పాఠశాలల్లో పనులు పూర్తికాగా, మిగతా పాఠశాలల్లో మే నెలాఖరుకల్లా పూర్తి చేస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు యూనిఫాం, కొత్త పుస్తకాలు అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. తొలుత పాఠశాల విద్యాకార్యక్రమాల వివరాలతో వీడియో ప్రదర్శించారు. ఎంఈఓ బి.రాములు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నక్కా రాజేశ్వరరావు, విద్యాకమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి
కొణిజర్ల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కృషి చేయాలని డీఈఓ సోమశేఖరశర్మ కోరారు. మండలంలోని లొల్లోరిగూడెం, తీగలబంజర ప్రాథమిక పాఠశాలలను సోమవారం సందర్శించిన ఆయన తల్లిదండ్రుల సమావేశాల్లో మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎస్‌ఎంసీ చైర్మన్ కోట అనిత, ఏఎంఓ కె.రవికుమార్, ఎంఈఓ ఎం.శ్యాంసన్, హెచ్‌ఎంలు పద్మావతి, జానకీరాణి, మాధవీలత, అరుణ, సీఆర్పీలు పవన్, సైదుబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు జీపీల్లో ఉపసర్పంచ్‌ల ఎన్నిక

ఖమ్మం సహకారనగర్/ఎర్రుపాలెం/ఖమ్మం అర్బన్: జిల్లాలోని రెండు గ్రామపంచాయతీల్లో ఉపసర్పంచ్ స్థానాలకు సోమవారం ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలోని 18 గ్రామపంచాయతీల్లో ఉప సర్పంచ్ స్థానాలు ఖాళీగా ఉండగా వీటిలో 16పంచాయతీల్లో వార్డుస్థానాలు కూడా ఖాళీలు ఉన్నాయి. అయితే, వార్డు స్థానాలకు ఎన్నిక నిర్వహించే అవకాశం లేకపోవటంతో మిగిలిన రెండు జీపీల్లో ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు రఘునాథపాలెం మండలం పువ్వాడ ఉదయ్‌నగర్‌లో 5వ వార్డు సభ్యులు షేక్ హసీనా, ఎర్రుపాలెం మండలంలోని అయ్యగారిగూడెంలో 9వ వార్డు సభ్యుడు జెజ్జం శ్రీకాంత్ ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. వీరిలో హసీనా బీఆర్ఎస్ మద్దతుదారులు కాగా, అయ్యగారిగూడెం ఉపసర్పంచ్ శ్రీకాంత్ కాంగ్రెస్ మద్దతుదారుడిగా కొనసాగుతున్నారు. కాగా, అయ్యగారిగూడెంలో ఎన్నికల అధికారిగా మిర్యాల జయకృష్ణ వ్యవహరించగా, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఎంపీఓ జి.శ్రీలక్ష్మి, సర్పంచ్ గోసు రామారావు పాల్గొన్నారు. ఇక పువ్వాడ ఉదయ్‌నగర్‌లో ఎన్నికల అధికారి వైరా ఆర్‌ఐ ఎం.వెంకటేశ్వర్లు వ్యవహరించగా, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ కాంపాటి లలిత, కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు కాంపాటి రవి, సిద్దయ్య పాల్గొన్నారు.

సత్తా చాటిన టీ.టీ. క్రీడాకారులు



బహుమతులు అందుకున్న క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: నల్లగొండలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లా బాలబాలికలు సత్తా చాటారు. అండర్ –13 బాలుర విభాగంలో జ్వాలిత్, బాలికల విభాగంలో బ్రహ్మణి ప్రథమస్థానంలో నిలిచి టైటిల్ దక్కించుకోగా, ఇదే విభాగంలో స్పందన చంద్ర రెండోస్థానం, వన్నిక, సౌమ్యశ్రీ, బాలురలో మోహిత్, తృతీయస్థానం గెలుచుకున్నారు. ఇక పలు విభాగాల్లో డాక్టర్ జొన్నలగడ్డ శశికుమార్, గద్దల సిరి, మామిడి ధరణి, థామస్ క్యాండీ, బహుమతులు సాధించారు. క్రీడాకారులను కలెక్టర్ వీ.పీ.గౌతమ్, డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి, టేబుల్ టెన్నిస్ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జంగాల సునీల్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్‌తో పాటు డాక్టర్ రఘునందన్, అనంత రాములు, నరసింహారెడ్డి, ప్రత్యూష, ఓలేటి సాంబమూర్తి అభినందించారు.

చోరీపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన కాంపాటి అప్పారావు ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. అప్పారావు తన భార్యతో కలిసి ఖమ్మం వెళ్లి సాయంత్రం వచ్చేసరికి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో పరిశీలించగా 12 గ్రాముల బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించిన వా రు సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమో దు చేసినట్లు ఎస్సై పొదిల వెంకన్న తెలిపారు.

వృద్ధురాలిపై దాడి.. గొలుసు అపహరణ



బాధితురాలితో మాట్లాడుతున్న సీఐ సురేష్, ఎస్సై వీరప్రసాద్

వైరా: వైరాలోని పాతబస్టాండ్ సెంటర్ వద్ద కిరాణ దుకాణంలో వృద్ధురాలిపై దాడి చేసిన ఆగంతకుడు ఆమె మెడలో ఉన్న బంగారపు గొలుసు అపహరించిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. కిరాణం షాపులో వృద్ధురాలు గృహలక్ష్మి ఉండగా, గుర్తు తెలి యని వ్యక్తి సామగ్రి కోసం వచ్చినట్లుగా చెబుతూ ధరలు అడిగాడు. అయితే, ఆమెకు ధరలు తెలియకపోవడంతో కుమారుడికి ఫోన్ చేసేందుకు లోనకు వెళ్లగా ఆమె వెనకే వచ్చిన వ్యక్తి బండతో తలపై కొట్టి మెడలోని మూడు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లాడు. దీంతో సమాచారం అందుకున్న సీఐ తాటిపాముల సురేష్, ఎస్సై శాఖమూరి వీరప్రసాద్ చేరుకుని సీసీ ఫుటేజీలు పరిశీలించారు. దుండగుడు బ్లూ కలర్ టీషర్ట్, మాస్క్ ధరించి ఉన్నట్లు గుర్తించి విచారణ చేపట్టారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,600	1,550
పెసలు	7,000	4,000
కందులు	7,700	7,700
మిర్చి	23,000	18,000
మిర్చి తాలు	12,500	9,000
పత్తి	7,575	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.13,943

మొరాయిస్తున్న పాలేరు గేట్లు

మరమ్మతుల కారణంగా నీటి లీకేజీ

- కాల్వలో ప్రవహిస్తున్న 30 క్యూసెక్కుల మేర నీరు
- ప్రత్యామ్నాయంపై దృష్టి సారించిన అధికారులు



లీకేజీతో పాలేరు కాల్వలో ప్రవహిస్తున్న నీరు, (ఇన్‌సెట్) లీకేజీల వద్ద వరిగడ్డి కట్టలు పెడుతున్న మత్స్యకారులు

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నుండి పాలేరు కాలువకు నీరు విడుదల చేసే గేట్లు తరచుగా మొరాయిస్తున్నాయి. దీంతో గేట్లు దించినా కొంత మేర నీరు లీక్ అవుతోంది. ప్రస్తుతం యాసంగి పంటలు పూర్తి కాగా రిజర్వాయర్ నుండి పాలేరు కాల్వ, ఎడమ కాల్వకు అధికారులు నీటి సరఫరా నిలిపివేశారు. దీనికి రిజర్వాయర్‌లోకి చేరిన సాగర్ జలాలతో నిండుకుండలా మారింది. కానీ పాలేరు కాల్వకు నీటి సరఫరా నిలివేసినా గేట్ల మరమ్మతు కారణంగా 30 క్యూసెక్కుల మేర నీరు కాల్వలో ప్రవహిస్తూ రిజర్వాయర్ నీటిమట్టం తగ్గిపోతోంది.

గేట్లు దించి.. వరి గడ్డి పెట్టి

రిజర్వాయర్ నుంచి నీరు బయటకు వెళ్లకుండా అధికారులు కాల్వ గేట్లను పూర్తి కిందకు దించారు. అయినా లీకేజీల కారణంగా నీరు వెళ్తుండడంతో వరిగడ్డి కట్టలను పెట్టి ఎక్కువ మోతాదులో వృథా కాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. రిజర్వాయర్ నిండుగా ఉండడంతో స్థానిక మత్స్యకారులు పడవల్లో వెళ్లి గడ్డి కట్టలను గేట్ల కింద పెట్టారు. దీంతో కొంతమేర నీటి వృథా అరికట్టగలిగినా.. గేట్ల మరమ్మతు కారణంగా ఎంచాలన్నా, దించాలన్నా ఇబ్బందులు తప్పవని తెలుస్తోంది. ఇక పాలేరు కాల్వకే కాకుండా ఔట్ ఫాల్(ఎడమ కాల్వ) గేట్ల వద్ద కూడా అధికారులు ఇలాంటి చర్యలే చేపట్టారు. ఈ గేట్లు బాగానే ఉన్నా రబ్బర్ సీళ్లు అరిగిపోవటంతో నీరు 300 క్యూసెక్కుల మేర లీక్ అవుతోంది. దీంతో అక్కడ కూడా వరిగడ్డి కట్టలు పెట్టిస్తున్నారు. కాగా, అధికారులు గేట్లను పూర్తిస్థాయిలో మరమ్మతు చేయించి నీటి వృథాను అరికట్టాలని ఆయకట్టు రైతాంగం కోరుతోంది.

మరమ్మతు చేయిస్తాం

పాలేరు గేట్లు మరమ్మతుల కోసం గత ఏడాది ప్రతిపాదనలు పంపించాం. ఇందుకు రూ.15లక్షలు నిధులు మంజూరయ్యాయి. అయితే, రిజర్వాయర్‌లో నిండా నీరు ఉన్నందున.. కాస్త నీటిమట్టం తగ్గాక పనులు చేపడుతాం. అప్పటివరకు నీరు వృథా కాకుండా ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించాం. – మధు, డీఈఈ

మృత్యువులోనూ వీడని స్నేహం!

- ఇద్దరి మృతితో అప్పలనరసింహాపురంలో విషాదం
- భర్త, ఆయన స్నేహితుడు బావిలో దూకడంతో మహిళ కూడా..
- ఆమెను రక్షించినా... మృత్యువాత పడిన ఇద్దరు




కర్లపూడి నాగరాజు, యండ్రాతి జోజి (ఫైల్)



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

నేలకొండపల్లి: ఇద్దరూ ప్రాణస్నేహితులు...చేసే వృత్తులు వేర్వేరైనా మంచి స్నేహితులుగా కొనసాగుతున్నారు.చివరకు మృత్యువులోనూ కలిసి వెళ్లారు. స్నేహితుడు భార్యను కాపాడే ప్రయత్నంలో ఇద్దరిని వ్యవసాయ బావి కబళించింది. ఇరువురు కూడా నిరుపేదలే కావడం, వీరి మృతితో పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబీకులు దిక్కు తోచని స్థితిలో రోదిస్తున్నారు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం జరగగా.. మృతదేహాలకు సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.

దంపతుల నడుమ వివాదం

నేలకొండపల్లి మండలం అప్పలనరసింహాపురానికి చెందిన దంపతులు రాత్రి కర్లపూడి నాగరాజు(35)–రమణ మధ్య వివాదం జరగగా, రమణ తాను బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి బయటకు వచ్చింది. దీంతో భర్త నాగరాజు ఇంటి ఎదురింట్లో ఉండే స్నేహితుడు యండ్రాతి జోజి(37)ని వెంట పెట్టుకునిబావి వద్దకు వెళ్లాడు. అక్కడ రమణ లేకపోవడంతో ఆమె బావిలో దూకిందనే అనుమానంతో జోజి, నాగరాజు కూడా దూకారు. అయితే, పక్కనే ఉండి గమనిస్తున్న రమణ కూడా భయంతో బావిలోకి దూకింది. దీంతో జోజికి ఈత రావటంతో రమణను ఆయన అప్పటికే చేరుకున్న గ్రామస్తుల సహకారంతో ఒడ్డుకు చేర్చాడు. కానీ రమణ భర్త నాగరాజుకు ఈత రాక బావిలోనే ఉండిపోగా జోజి మరోమారు దూకాడు. కానీ బావి లోతుగా ఉండటంతో ఆయను కాపాడలేక ఇద్దరు అడుగుకు చేరుకున్నారు. దాదాపు రెండు గంటల పాటు గాలించిన యువకులు ఎట్టకేలకు ఇద్దరి మృతదేహాలను గుర్తించి బయటకు తీశారు. ఖమ్మం ప్రభుత్వ హస్పిటల్‌లో పోస్టమార్టం అనంతరం సోమవారం ఉదయం స్వగ్రామానికి తీసుకురాగా ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి నివాళులర్పించి ఆర్థికసాయంఅందించారు.

శోకసంద్రంగా అప్పలనరసింహాపురం

గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం సముదాయంలో స్నేహితులైన నాగరాజు, జోజికి ఎదురెదురుగా ఇళ్లు వచ్చాయి. వీరిలో జోజి మంచి కళాకారుడు కాగా అందరితో కలివిడిగా ఉండేవాడు. ఆయనకు భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన సుతారీ పనికి వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. జోజితల్లి చిన్నతనంలోనే చనిపోగా అమ్మమ్మే అన్నీ పెంచింది. ఇటీవలే ఆమె మృతి చెందగా వారం రోజుల్లో దశదిన కర్మ చేయాల్సి ఉంది. ఇంతలోనే జోజి కూడా మృతి చెందడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది. ఇక కర్లపూడి నాగరాజుకు భార్య, ఎనిమిది నెలల కుమారి జస్విత్ ఉంది. పెయింటర్ అయిన ఆయన ఇటీవలే కూతురు అన్నప్రసాన వేడుక జరిపించాడు. ఇంతలోనే బావి ఆయనను బలి తీసుకుంది.

వైరా మున్సిపల్ సమావేశం వాయిదా

- పూర్వ కమిషనర్ రావాలని బీఆర్ఎస్ కౌన్సిలర్ల పట్టు
- ఎమ్మెల్యే సమక్షంలో ఫ్లకార్డులతో నిరసన



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్, పక్కన ఎమ్మెల్యే రాములునాయక్



ఫ్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

వైరా: వైరా మున్సిపాలిటీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఏర్పాటుచేయగా.. ఎలాంటి చర్చ జరగకుండానే వాయిదా పడింది. చైర్మన్ సూతకాని జైపాల్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ హాజరయ్యారు. అయితే, ఎమ్మెల్యే సమక్షంలోనే బీఆర్ఎస్ కౌన్సిలర్లు.. గతంలో ఇన్‌చార్జ్ కమిషనర్‌గా పనిచేసిన ప్రస్తుత ఏఈ అనిత సమావేశానికి రావాలని పట్టుబడ్డారు. ఆమె వస్తేనే అజెండాపై చర్చించాలని స్పష్టం చేయడంతో ఎమ్మెల్యే రాములునాయక్ నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారు వినకపోగా మున్సిపాలిటీలో అవినీతిపై ఎందుకు విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఇలా రెండు గంటల పాటు నిరసన కొనసాగడంతో ఎమ్మెల్యే వెళ్లిపోగా సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ పతాని వెంకటేశ్వర్లు ప్రకటించారు.

పార్టీ మారడంతోనే వేధింపులు

సమావేశం వాయిదా పడ్డాక మున్సిపల్ చైర్మన్ జైపాల్, మరో ముగ్గురు కౌన్సిలర్లు విలేకరులతో మాట్లాడారు. నమ్ముకున్న నాయకుడి కోసం బీఆర్ఎస్ నుంచి తాము బయటకు వెళ్లడంతో వేధిస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీలో ఉన్నప్పుడు అవినీతి కనిపించకపోగా.. ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. మున్సిపాలిటీలో ఏదైనా పాలకపక్షం అనుమతితోనే జరిగిందని ఏకపక్షంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. కాగా, ఏఈ అనిత సమావేశానికి ఎప్పుడు హాజరైతే అప్పుడు సమావేశం నిర్వహిస్తామని కమిషనర్ వెంకటేశ్వర్లు ప్రకటించారు.

ప్రజా ఆస్తులను అమ్మేస్తున్న బీజేపీ ప్రభుత్వం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

రఘునాథపాలెం: దేశంలోని కులమతాల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ ప్రభుత్వం ప్రజాఆస్తులను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. మండలంలోని కామంచికల్‌లో భూక్యా కృష్ణ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబానీ, అదానీలకు రూ.లక్షల కోట్ల రుణాలు మాఫీ చేయడం ద్వారా దేశాన్ని ఆర్థికంగా దివాళా తీయిస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సీపీఐతో పాటు కలిసివచ్చే శక్తులతో పయనిస్తామని తెలిపారు. సీపీఐ నాయకుడు బోజడ్ల సూర్యం మాట్లాడుతూ సీపీఐ, సీపీఎం కలిసి పనిచేస్తే ఖమ్మం జిల్లాలో వేరే పార్టీలకు చోటు ఉండదని తెలిపారు. తొలుత మాజీ సర్పంచ్ ప్రతాపనేని సత్యనారాయణ, స్వాతంత్ర సమరయోధులు నువ్వుల వెంకటయ్య, చెరుకూరి రాఘవయ్య, చెరుకూరి కష్టయ్య చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. సీపీఎం పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, జోనల్ ఇన్‌చార్జి పి.సంగయ్య, నాయకులు ముదాం శ్రీను, తాటికొండ శీను, గద్దల జనార్దన్, నువ్వుల మోహన్‌రావు, కోటేష్, వీరయ్య, కూచిపూడి మధు, నవీన్‌రెడ్డి, ప్రసాద్, గద్దల రత్తమ్మ, ప్రతాపనేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మారని పేదల బతుకులు..



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాపంథా నాయకులు

ప్రజాపంథా ఆధ్వర్యాన ర్యాలీ, ధర్నా

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నో ఆశలతో పోరాడి సాధించుకున్న తెలంగాణ పేదల బతుకులు మారడం లేదని.. కూడు, గూడు కోసం నిరంతరం పోరాడాల్సి వస్తోందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇళ్లు కట్టుకునేందుకు రూ.10 లక్షలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఇవ్వాలనే డిమాండ్‌తో ప్రజాపంథా ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్దకు భారీ ర్యాలీగా చేరుకుని ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని చెప్పి ఇప్పుడు మాట మార్చారని ఆరోపించారు. ఇకనైనా స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.10 లక్షలు ఇవ్వాలని, స్థలం లేకపోతే స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నగదును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా ఇవ్వాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, సీ.వై.పుల్లయ్య, ఆర్.శివలింగం, మలీదు నాగేశ్వరరావు, బండెల వెంకయ్య, కె.నాగేశ్వరరావు, సీహెచ్.శిరోమణి, టి.ఝాన్సీలక్ష్మి, ఆవుల మంగతాయి, లాల్‌మియా, గంటా శ్రీనివాసరావు, కొయ్యల శ్రీనివాస్, బి.లాజర్, ఎస్.ఆజాద్, శరత్, మందా సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ర్యాలీలో కానిస్టేబుల్‌కు అస్వస్థత



అస్వస్థతకు గురైన కానిస్టేబుల్ నర్సింహ

ఖమ్మం సహకారనగర్: కాంగ్రెస్ ఆధ్వర్యాన సోమవారం ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీకి బందోబస్తు విధులకు వచ్చిన ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబల్ నర్సింహా అస్వస్థతకు గురయ్యారు. ర్యాలీలో పార్టీ శ్రేణులు తోసుకోవటంతో కానిస్టేబుల్ కింద పడ్డాడు. దీంతో కార్యకర్తలను ఆయనను లేపి సపర్యలు చేయడంతో కోలుకున్నాడు.

సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడొచ్చు



సిబ్బందితో సీపీఆర్ చేయిస్తున్న దృశ్యం

ఖమ్మంక్రైం: గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్ చేసి మనిషి ప్రాణాలను కాపాడొచ్చని సీపీ ఆర్మీ ఏసీపీ వెంకటస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో డాక్టర్ జితేందర్ ఆధ్వర్యాన సోమవారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మినిస్ట్రీయల్ స్టాఫ్, పోలీస్ సిబ్బందికి అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ ఎలా చేయాలనే అంశంపై వైద్య నిపుణులు వివరించారు. కార్డియాక్ అరెస్ట్ కారణంగా మరణాల సంఖ్య పెరిగిపోవటంతో సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవి, ఏఓ అక్తరున్నీసాబేగం, సీఐ తుమ్మా గోపి తదితరులు పాల్గొన్నారు.

పత్తి వ్యాపారం మాటున కలప స్మగ్లింగ్

- ఛత్తీస్‌గఢ్ అధికారుల సమాచారంతో పట్టివేత
- వివరాలు వెల్లడించిన ఎఫ్ఆర్ఓ



పట్టుబడిన వాహనంలో టేకు కలప

భద్రాచలంటౌన్: పగలంతా గ్రామాల్లో తిరుగుతూ పత్తిని సేకరించి రాత్రి సమయంలో ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే టేకు కలపను పత్తి కింద వేసి అక్రమంగా తరలిస్తున్న స్మగ్లర్ల గుట్టురట్టయింది. ఇరు రాష్ట్రాల అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భారీగా కలపను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి దుమ్ముగూడెం మండలంలో జరిగిన ఈ ఘటన వివరాలను భద్రాచలం ఎఫ్ఆర్ఓ బీవీఎస్‌కే ప్రసాద్ సోమవారం విలేకరులకు వెల్లడించారు. దుమ్ముగూడెం మండల సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఎర్రబోరు గ్రామం నుంచి ఓ వాహనంలో భారీగా టేకు కలపను తెలంగాణ వైపునకు తరలిస్తున్నారనే సమాచారాన్ని అక్కడి అటవీశాఖ అధికారులు భద్రాచలం అధికారులకు అందించారు. వెంటనే స్పందించిన అధికారులు దుమ్ముగూడెం మండలంలోని కమలాపురం గ్రామ సరిహద్దుల్లో సిబ్బందితో కలిసి మాటు వేశారు. ఈ క్రమంలో టీఎస్04యూడీ9433 నంబరు గల ఒక అశోక్ లేలాండ్ గూడ్స్ క్యారియర్ వాహనం వేగంగా వెళ్తుండడంతో దానిని వెంబడించారు. ఈ క్రమంలోనే వాహనాన్ని నిలిపివేసి డ్రైవర్ పరారయ్యాడు. అధికారులు, సిబ్బంది వాహనం వద్దకు చేరుకుని తనిఖీ చేయగా పత్తి కింద 10 టేకు కలప దుంగలు కనిపించాయని ఎఫ్ఆర్ఓ వివరించారు. దీంతో వాహనాన్ని భద్రాచలం అటవీశాఖ కార్యాలయానికి తరలించామని, పట్టుబడిన టేకు కలపతో పాటు 4 క్వింటాళ్ల పత్తిని సీజ్ చేశామని చెప్పారు. పట్టుబడిన టేకు కలప ఛత్తీస్‌గఢ్ అడవులలో నరికినట్లు గుర్తించామని, దీని విలువ సుమారు రూ.1.38 లక్షలు ఉంటుందని ఆయన వెల్లడించారు. ఎఫ్‌బీఓలు రమేశ్, కుమార్, నరేశ్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

'దళితబంధు'లో మంజూరైన వాహనం..

అక్రమంగా టేకు కలపను తరలిస్తూ పట్టుబడిన వాహనం దళితబంధు పథకంలో మంజూరైంది. ఖమ్మం జిల్లా చింకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన తుడుము తిరుపతయ్యకు దళిత బంధు పథకం కింద అశోక్ లేలాండ్ గూడ్స్ క్యారియర్ వాహనం యూనిట్‌ను అధికారులు అందజేశారు. కాగా, ఈ వాహనాన్ని తిరుపతయ్య తల్లాడ మండలం రామానుజవరం గ్రామానికి చెందిన కిన్నెర గోపీకృష్ణకు నెలవారి అద్దె ప్రాతిపదికన ఈ నెల 20న లీజుకు ఇచ్చాడు. ఈ క్రమంలో గోపీకృష్ణ ఈ వాహనాన్ని టేకు కలప స్మగ్లింగ్‌కు వాడడంతో అటవీ శాఖ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేసి సీజ్ చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



జానీ (ఫైల్)

కల్లూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని చెన్నూరుకు చెందిన షేక్ జానీ(40)ని ఆదివారం రాత్రి వైఎస్.పురం క్రాస్‌రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఖమ్మం తరలించగా సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. జానీకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



బెంజిమెన్ (ఫైల్)

వైరారూరల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని విప్పలమడకకు చెందిన ముత్తమాల బెంజిమెన్(36) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కొద్దినెలలుగా ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో బెంజిమన్ దంపతుల నడుమ గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆమె మూడు నెలల క్రితం పుట్టింటికి వెళ్లగా, తిరిగి రావాలని కోరినా ఆమె నిరాకరించడంతో బెంజిమెన్ ఈనెల 21న పురుగుల మందు తాగాడు. కాసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మూగజీవాలు మృతి

ఏన్కూరు: మండలంలోని మర్సకుంటలో సోమవారం ఉదయం విద్యుదాఘాతంతో రెండు గేదెలు, ఒక ఆవు మృతి చెందాయి. గ్రామానికి చెందిన చెరుకుమల్లి సీతయ్యకు చెందిన రెండు గేదెలు, మరయదాస్‌కు చెందిన ఆవు ఉదయం సమీప చెరువు వద్దకు మేత కోసం వెళ్లాయి. అక్కడ వేలాడుతున్న విద్యుత్‌తీగలను తాకడంతో షాక్‌కు గురై మృతి చెందాయి. సుమారు రూ.2లక్షల విలువైన జీవాలను కోల్పోయిన తమను ఆదుకోవాలని యజమానులు కోరారు. కాగా, ఘటనాస్థలాన్ని ఎంపీటీసీ గుగులోతు లచ్చిరాం నాయక్, బీఆర్ఎస్ నాయకుడు వీరునాయక్ పరిశీలించారు.

చిమ్మపూడిలో మూడు గేదెలు

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడిలో ఆదివారం రాత్రి వచ్చిన గాలివానకు పలుచోట్ల విద్యుత్ తీగలు తెలియపడ్డాయి. ఈమేరకు సోమవారం ఉదయం నాగండ్ల రామచంద్రయ్య, యనిసెట్టి అప్పారావు, సత్తి నర్సయ్యకు గేదెలు మేతకు వెళ్లగా తీగలను తాకడంతో షాక్ గురై మృతి చెందాయి. వైస్ ఎంపీపీ గుత్తా రవి, విద్యుత్ ఏఈ సతీష్ పరిశీలించారు.

మొక్కజొన్న పంట దగ్ధం

చింతకాని: మండలంలోని నేరడలో విద్యుదాఘాతం కారణంగా రైతు మంకెన గోవిందరావుకు చెందిన మూడు ఎకరాల మొక్కజొన్న పంట సోమవారం దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పురవ్వలు పంటపై పడడంతో మంటలు చెలరేగి మూడు ఎకరాల్లోని పంట మొత్తం అగ్నికి ఆహుతైంది. అగ్నిమాపక సిబ్బంది చేరుకునేలోగా సుమారు రూ.2 లక్షల విలువైన పంట కాలిపోయిందని రైతు వెల్లడించారు. ఈమేరకు ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆయన కోరాడు.

క్లుప్తంగా...

వివేకా కేసు దర్యాప్తు గడువు పొడిగింపు

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో దర్యాప్తు కాల పరిమితిని సుప్రీంకోర్టు పొడిగించింది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల 30వతేదీతో గడువు ముగియనుండగా తాజాగా జూన్ 30 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యా యమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు వెలువరించింది. మరోవైపు ఈ కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్‌కి సంబంధించి తెలంగాణ హై కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈమేరకు వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ముగించింది. సునీత తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా, అవినాశ్‌రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ గురించి ఈ సమయంలో అడగాల్సిన అవసరం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా మంగళవారం తెలంగాణ హైకోర్టు ముందుకు రానున్న పిటిషన్‌లో ముందస్తు బెయిల్‌కు సంబంధించి అవినాశ్ రెడ్డి తన వాదనలు వినిపించుకోవచ్చని ధర్మాసనం చెప్పింది.

మంజీరా కుంభమేళా ప్రారంభం

న్యాల్‌కల్(జహీరాబాద్): సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల పరిధిలోని రాఘవాపూర్–హుమ్నాపూర్ గ్రామాల శివారులోని పంచవటి క్షేత్రంలో మంజీర (గరుడగంగ) కుంభమేళా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. క్షేత్రంలోని ఆలయాల్లో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం, గంగా స్నానాలు, బోనాల ఊరేగింపు, గంగపూజ, హోమం, పూర్ణాహుతి, అమృత స్నానాల కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్, జహీరాబాద్, నారాయణఖేడ్ ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, భూపాల్‌రెడ్డి ఉత్సవాలకు హాజరయ్యారు.

నేటి నుంచి రామానుజుల జయంతి వేడుకలు

శంషాబాద్ రూరల్: భగవద్రామానుజుల 1006వ జయంతి సందర్భంగా మంగళవారం నుంచి ముచ్చింతల్ సమీపంలోని శ్రీరామనగరం సమతా స్ఫూర్తి కేంద్రంలో వేడుకలు నిర్వహించనున్నారు. మే 1 వరకు జరిగే ఈ వేడుకల్లో రోజూ తిరుమంజన సేవ, తిరువీధి సేవలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.


ఔరంగాబాద్ సభకు హాజరైన జనం

నదులున్నా తాగునీరేదీ?

▶ మొదటి పేజీ తరువాయి

దేశం ముందుకెళ్లదు. అనివార్యమైన మార్పును తీసుకురావడం కోసమే బీఆర్‌ఎస్ పుట్టింది. ఒక కులం, మతం, వర్గం కోసం ఆవిర్భవించలేదు. బీఆర్‌ఎస్‌కు ఒక లక్ష్యం ఉంది. మార్పు వచ్చే వరకు పార్టీ పోరాటం ఆగదు. నిజాయితీగా మేం చేసే పోరాటానికి విజయం తథ్యం. మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికీ నీరు ఇస్తాం. కొత్త పార్టీ అనగానే కొందరు అపవాదులు సృష్టిస్తారు. ఎన్ని అవాంతరాలు సృష్టించినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదు..' అని కేసీఆర్ స్పష్టం చేశారు.

అబద్ధమైతే సీఎం పదవిలో నిమిషం కూడా ఉండను

'వాస్తవానికి దేశంలో సమృద్ధిగా నీటి వనరులున్నాయి. వీటిని సాగు యోగ్యత ఉన్న భూములకు అందించాల్సి ఉంది. 24 గంటలు విద్యుత్ సరఫరా చేయగల వనరులు ఉన్నాయి. దేశం మొత్తం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇవ్వొచ్చు. నేను చెప్పేది అబద్ధమైతే ఒక్క నిమిషం కూడా సీఎం పదవిలో ఉండను. తెలంగాణలో మంచినీటి సమస్య లేకుండా చేశాం. తెలంగాణ రాకముందు రోజుకు 3 గంటలే కరెంటు ఉండేది. ఒక్కోసారి అది కూడా ఉండేది కాదు. ప్రస్తుతం తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తున్నాం. భూముల రిజిస్ట్రేషన్లు పావుగంటలో అవుతున్నాయి. రైతు చనిపోతే బీమా కల్పిస్తున్నాం. ఇవి మహారాష్ట్రలో ఎందుకు అమలు కావడం లేదు? తెలంగాణలో సాధ్యమైనప్పుడు మహారాష్ట్రలో ఎందుకు సాధ్యం కాదు? ఎందుకంటే ప్రధాని, రాష్ట్రాల సీఎంలకు ఆ పనిచేసే సామర్థ్యాలు లేవు..' అని కేసీఆర్ విమర్శించారు.

కొత్త సంకల్పంతో ముందుకు సాగాలి

'నా మాటలు ఇక్కడ విని ఇక్కడే మరిచిపోకండి. గ్రామాలకు వెళ్లి చర్చ చేయండి. మీ ఇంటివాళ్లు, స్నేహితులు, వీధిలో ఉన్న వారితో చర్చించండి. దేశంలో ఉండాల్సిన స్థితిలో ఉందా? లేదా? అనే విషయంపై చర్చ పెట్టాలి. లక్ష్యం లేని ప్రయాణం ఎక్కడికి వెళుతుంది? దేశం కొత్త లక్ష్యాలు, కొత్త సంకల్పంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు అయ్యింది. అయినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. శంభాజీనగర్‌లో వారానికోసారి నీళ్లు వస్తాయా? మహారాష్ట్రలో కేబినెట్ ఉంటుంది. చీఫ్ సెక్రటరీ ఉండరా?..' అని ప్రశ్నించారు.


ఔరంగాబాద్ సభలో సీఎం కేసీఆర్

తెలంగాణ మోడల్ అమలు చేస్తే ఎందుకు వస్తా?

'కేసీఆర్‌కు మహారాష్ట్రలో ఏం పని అని ఫడ్నవీస్ అంటున్నారు. తెలంగాణ లాంటి మోడల్ మహారాష్ట్రలో తీసుకొస్తే నేనెందుకు వస్తాను? మహారాష్ట్రలో దళితబంధు, రైతుబంధు అమలు చెయ్.. 24 గంటల కరెంటు ఇవ్వు. రైతుబంధు, రైతుబీమా కల్పించండి. ఇవన్నీ అమలు చేస్తే మహారాష్ట్రకు రానే రాను. అంబేడ్కర్ జన్మించిన నేలపై దళితులను పట్టించుకోరా? దళితబంధు లాంటి పథకం మహారాష్ట్రలో ఎందుకు అమలు చేయరు?..' అని నిలదీశారు.

ప్రజల ఆకాంక్ష గెలవాలి

'దేశంలో పరివర్తన రావాల్సిన అవసరం ఉంది. ఒక పార్టీ గెలిస్తే.. మరో పార్టీ ఓడిపోవడం పరివర్తన కాదు. ఎవరు గెలిచినా సమస్య అపరిష్కృతంగానే ఉంటోంది. అందువల్ల పార్టీలు గెలవడం ముఖ్యం కాదు.. ప్రజల ఆకాంక్ష గెలవడం ముఖ్యం. పరివర్తన రానంత కాలం ఈ దేశం ఇలాగే కునారిల్లుతుంది. ఎంత త్వరగా మేల్కొంటే.. అంత త్వరగా బాగుపడతాం..' అని కేసీఆర్ అన్నారు. నూతనంగా నిర్మించే పార్లమెంటుకు అంబేడ్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.

అభయ్ పాటిల్ ఇంటికి కేసీఆర్

హైదరాబాద్ నుంచి ఔరంగాబాద్ సభకు వెళ్లిన కేసీఆర్, విమానాశ్రయం నుంచి నేరుగా వైజాపూర్ మాజీ ఎమ్మెల్యే అభయ్ పాటిల్ ఇంటికి చేరుకున్నారు. ఆయనకు అక్కడ అపూర్వ స్వాగతం లభించింది. మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ పార్టీ ఆఫీసు ఏర్పాటు చేస్తామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. కేసీఆర్ వెంట పార్టీ ఎంపీలు కేశవరావు, రంజిత్ రెడ్డి, సంతోష్ కుమార్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, కడియం శ్రీహరి, ఎమ్మెల్యే బాల్క సుమన్ ఉన్నారు.

కార్యోన్ముఖులుగా కార్యకర్తలు

నేడు బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడంలో భాగంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ప్రతినిధుల సభలు నిర్వహించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 27న బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో మంగళవారం నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే ప్రతినిధుల సభల్లో సుమారు 3 వేల నుంచి 3,500 మంది కార్యకర్తలు పాల్గొనే అవకాశం ఉంది. రాష్ట్రమంతా కలుపుకుని క్షేత్ర స్థాయిలో క్రియాశీలంగా పనిచేస్తున్న సుమారు నాలుగు లక్షల మంది కార్యకర్తలు, నేతలు ఈ సభల్లో భాగస్వాములు కానున్నారు. ఈ సభల్లో ఆరు తీర్మానాలు చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటికే దిశా నిర్దేశం చేశారు. సాగు, సంక్షేమం, పల్లె ప్రగతి– పట్టణ ప్రగతి, విద్య ఉపాధి, బీజేపీ వైఫల్యాలు, స్థానిక అంశాలపై ప్రతినిధులు తీర్మానాలు చేయనున్నారు.

నేటి నుంచి ఆర్టి'జనుల' సమ్మె

- పిలుపునిచ్చిన ఆర్టిజన్ల ప్రాతినిధ్య సంఘాలు
- సమ్మెతో తమకు సంబంధం లేదన్న ప్రధాన ఉద్యోగ సంఘాలు
- ఎస్మా ప్రయోగిస్తామని యాజమాన్యాల హెచ్చరిక
- విద్యుత్ సంస్థల్లో తీవ్ర ఉత్కంఠ పరిస్థితులు

సాక్షి, హైదరాబాద్: తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర విద్యుత్ సంస్థల్లోని 'ఆర్టిజన్లు' మంగళవారం ఉదయం 8 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతారని ఉద్యోగ సంఘాలు ప్రకటించాయి. 23 వేల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను గతంలో విద్యుత్ సంస్థలు ఆర్టిజన్ల పేరుతో విలీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్టిజన్ల సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలంగా పోరాడుతున్నా ఫలితం లేకపోవడంతో ఈనెల 25 నుంచి సమ్మెబాటపట్టాలని.. తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ (హెచ్82), ఇత్తెహాద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్‌లు పిలుపునిచ్చాయి. కాగా, విద్యుత్ సంస్థల్లో సమ్మెలపై నిషేధం అమల్లో ఉందని, ఎవరైనా సమ్మెకు దిగినా, విధులకు గైర్హాజరైనా అత్యవసర సేవల నిర్వహణ చట్టం (ఎస్మా) ప్రయోగించి ఉద్యోగం నుంచి తొలగించాలని అధికారులకు విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ఆదేశాలు జారీచేశాయి. దీంతో సమ్మెపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

స్టాండింగ్ ఆర్డర్స్ రద్దు చేయాలి..

రెగ్యులర్ విద్యుత్ ఉద్యోగులకు ఏపీ ఎలక్ట్రిసిటీ బోర్డు సర్వీస్ రూల్స్‌ను, ఆర్టిజన్ల కోసం 'స్టాండింగ్ ఆర్డర్స్' పేరుతో ప్రత్యేక సర్వీస్ రూల్స్‌ను అమలు చేస్తున్నారు. అయితే, తమకూ ఎలక్ట్రిసిటీ బోర్డు సర్వీస్ రూల్స్‌ను వర్తింపజేయాలని ఆర్టిజన్లు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, 7% ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ అమలు, ఇతర సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న విద్యుత్ ఉద్యోగ సంఘాల ఉభయ జేఏసీలతో సంస్థల యాజమాన్యాలు వేతన సవరణ ఒ ప్పందం కుదుర్చుకోగా, దీన్ని 'ఆర్టిజన్ల' సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. విద్యార్హతలు, నైపుణ్యం ఆధారంగా ఆర్టిజన్లను రెగ్యులర్ పోస్టులకు తీసుకుని పదోన్నతి కల్పించాలని, 50% ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలని, కనీసం రూ.25 వేలకు తగ్గకుండా మాస్టర్ స్కేల్‌ను ఖరారు చేయాలని ఈ సంఘాలు సమ్మె నోటీసుల్లో కోరాయి.

నిరంతర విద్యుత్ సరఫరాపై ప్రభావం !

నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగింపులో ఆర్టిజన్ల సేవలు కీలకం. ఎక్కడ చిన్న అంతరాయం కలిగినా రంగంలో దిగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు. మరమ్మతులు, నిర్వహణ విభాగాల్లో వీరి సంఖ్యే అధికం. దీంతో ఆర్టిజన్లు పాక్షికంగా సమ్మెకి దిగి నా నిరంతర విద్యుత్ సరఫరాపై ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

సమ్మెలో పాల్గొంటే కఠిన చర్యలు

విద్యుత్ సంస్థల్లో ఎస్మా కింద సమ్మెలపై నిషేధం అమల్లో ఉన్నందున ఆర్టిజన్లు పిలుపునిచ్చిన సమ్మె పూర్తిగా చట్టవిరుద్ధమని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు స్పష్టం చేశారు. సమ్మెకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏప్రిల్ 15న అన్ని ఉద్యోగ సంఘాలతో పాటే ఆర్టిజన్లకు కూడా సహేతుకమైన వేతన సవరణ చేశామన్నారు. కాగా, ఆర్టిజన్ల సమ్మెతో తమకు సంబంధం లేదని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ, టీఈఈ 1104 యూనియన్, టీఎస్‌పీఈఈయూ–1535, బీఆర్‌టీవీకేఎస్, టీఎస్ఈఈయూ–327 యూనియన్లు ప్రకటించాయి.

యువతి గొంతు కోసిన ప్రేమోన్మాది

అడ్డుకున్న స్థానికులు.. ఆస్పత్రిలో చేరిక

అమీర్‌పేట/రహమత్‌నగర్: యువతిపై కత్తితో దాడి చేసాడో ప్రేమోన్మాది. తనను కాదని వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుంటోందని కక్షగట్టి గొంతు కోసాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసుల కథనం మేరకు బోరబండ బంజారానగర్‌లో సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా.. మహబూబ్‌నగర్ జిల్లా తుర్కపల్లికి చెందిన సిద్దప్ప కుమార్తె లక్ష్మి గత కొంత కాలం క్రితం నగరానికి వచ్చి బోరబండ సైట్–1లో ఉంటోంది. స్థానిక స్వరాజ్‌నగర్‌కు చెందిన కిషోర్‌తో పరిచయమైంది. అతను మోతీనగర్‌లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపగా లక్ష్మి చాలా కాలం అక్కడే పనిచేసింది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో అక్కడ పని మానివేసింది. కిషోర్ కూడా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ఎత్తివేశాడు. ఆ తర్వాత అతను పలు మార్లు మాట్లాడేందుకు ప్రయత్నించినా నిరాకరించింది. కాగా, ఇటీవల వేరే వ్యక్తితో లక్ష్మికి నిశ్చితార్థం జరిగినట్లు కిషోర్‌కు తెలిసింది. వేరే వ్యక్తిని పెళ్లి చేసుకోవడాన్ని కిషోర్ జీర్ణించుకోలేక ఎలాగైనా ఆమెను మట్టు పెట్టాలనే నిర్ణయానికి వచ్చాడు. ఈ క్రమంలో హౌస్ కీపింగ్ పని చేస్తున్న లక్ష్మి సోమవారం పని ముగించుకుని సాయంత్రం 4.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా బంజారానగర్‌లో ఆమెను అడ్డగించాడు. కళ్లల్లో కారం చల్లి ఫాస్టు ఫుడ్ సెంటర్‌లో ఉల్లి గడ్డలు కోసే కత్తితో గొంతు కోశాడు. స్థానికులు వారించగా కత్తి చూపి బెదిరించాడు. అందరూ చూస్తుండగానే గొంతుపై రెండు, చేతులపై రెండు పోట్లు పొడిచాడు. అంతలోనే స్థానికులు పట్టుకున్నారు. తీవ్ర గాయాలైన యువతిని ప్రయివేటు ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆమె తలకు హెల్మెట్ ఉండటంతో తలపై తీవ్రగాయాలు కాకుండా తప్పించుకోగలిగినప్పటికీ ప్రస్తుత పరిస్థితి ఒకింత ఆందోళనకరంగానే ఉందని పోలీసులు తెలిపారు.


నిందితుడు కిషోర్

జిల్లా వార్తలు

సమ్మర్ క్యాంపుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి


దరఖాస్తులు స్వీకరిస్తున్న డీడీ రమాదేవి, ఏపీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలం: గిరిజన విద్యార్థినీ, విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్న సమ్మర్ క్యాంప్‌లను ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు అందించిన దరఖాస్తులను డీడీ రమాదేవితో కలిసి స్వీకరించారు. అనంతరం సంబంధిత యూనిట్ అధికారులకు అందజేసి అర్హతల మేరకు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అర్హులైన ప్రతీ గిరిజనుడికి ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. ఆ తర్వాత అధికారులతో సమావేశమైన ఏపీఓ మాట్లాడుతూ సమ్మర్ క్యాంపుల్లో అన్ని వసతులు ఏర్పాటు చేసి ఎక్కువ మంది విద్యార్థులు వచ్చేలా అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో వివిధ విభాగాల అధికారులు శ్రీనివాస్, మునీర్‌పాషా, ఆదినారాయణ, హరికృష్ణ, ప్రమీల బాయి పాల్గొన్నారు.

27 నుంచి ఎంఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూక్యాంపస్: కేయూ పరిధిలో ఎంఈడీ మూడో సెమిస్టర్ పరీక్షల(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్)ను ఈ నెల 27 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈ నెల 27, 29, మే 1, 3వ తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

28 నుంచి లా సెమిస్టర్ పరీక్షలు

కేయూ పరిధిలో మూడేళ్ల లా కోర్సు మొదటి సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈ నెల 28 నుంచి జరగనున్నాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈ నెల 28, మే 3, 6, 10, 13 తేదీల్లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు వెల్లడించారు.

భవిష్యత్‌పై నీలినీడలు

- బొగ్గుగని పుట్టింటి వాసుల్లో సంశయం
- ఇల్లెందులో తరుముకొస్తున్న జేకే ఓసీ ఏర్పాటు పనులు
- ఇప్పటికీ ప్రభావిత ప్రాంత పరిధిపై అస్పష్టతే
- రేపు జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణపైనే అందరి దృష్టి

ఇల్లెందురూరల్: సింగరేణి సంస్థ ఆవిర్భావం నాటి తీపి గుర్తులకు ఆలవాలమైన ఇల్లెందులోని 21పిట్ ఏరియా నేడు భవిష్యత్‌పై భయంతో కొట్టుమిట్టాడుతోంది. ఇల్లెందు ఏరియాలో భూగర్భ గనులు, ఉపరితల గనులు ఒక్కొక్కటిగా మూతపడగా.. ఈ ప్రాంతం భూ అంతర్భాగంలోని బొగ్గు వెలికితీసేందుకు యాజమాన్యం జేకే ఓసీ ఏర్పాటుకు సిద్ధమైంది. ఇప్పటికే భూసేకరణ, అటవీ అనుమతి పొందిన యాజమాన్యం త్వరలోనే ప్రజాభిప్రాయ సేకరణ పూర్తిచేసి ఓసీ పనులు ప్రారంభించాలనే ఆలోచనలో ఉంది. ఇదే సమయాన ఓసీ ఏర్పాటుపై స్పష్టత లేక ప్రజల్లో గందరగోళం నెలకొని ఉంది. ఈనెల 26న నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో ఏం జరుగుతుందోననే చర్చ ప్రస్తుతం సాగుతోంది. కాలనీ ఉంటుందా, పూర్తిగా అంతరించిపోతుందా అనే సందేహాలతో స్థానికులు కొట్టుమిట్టాడుతున్నారు.

ఓసీ ప్రకటనతో ప్రకంపనలు

ఇల్లెందు ఏరియాలో ఇప్పటివరకు కొనసాగిన జేకే–5 ఓసీ మనుగడ ప్రశ్నార్థకం కావడంతో సింగరేణి యాజమాన్యం సంస్థ పుట్టినింటిని మరికొంత కాలం నిలబెట్టాలనే ఆలోచనతో జేకే ఓసీ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా 21పిట్ ఏరియాలో కొంతభాగం, సీఎస్‌పీ బస్తీ గ్రామపంచాయతీ పరిధిలో మరికొంత భాగం, పూసపల్లి గ్రామ పరిధిలో ఇంకొంత భాగానికి తోడు అటవీ, రెవెన్యూ భూములను కలుపుకుని జేకే ఓసీ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించింది. ఇప్పటికే పర్యావరణ, అటవీ ఇతరత్రా అవసరమైన అనుమతులు సాధించిన సింగరేణి సంస్థ ఈనెల 26న పబ్లిక్ హియరింగ్(ప్రజాభిప్రాయ సేకరణ) చేపట్టాలని నిర్ణయించింది.

ముసురుకున్న సందేహాలు..

ఓసీ ఏర్పాటుకు సంబంధించిన వివరాలపై స్థానికులకే కాక ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలకు స్పష్టత కొరవడింది. ఈ అనుమానాలను నివృత్తి చేసేందుకు సింగరేణి యాజమాన్యం ఎలాంటి చొరవ తీసుకోవడంలేదు. 21పిట్ ఏరియాలో ఓసీ ఎంత వరకు తీస్తారు. ప్రభావిత ప్రాంతం విస్తీర్ణం ఎంత.. నిర్వాసితుల సంఖ్య, ప్రాథమిక సర్వేలో యాజమాన్యం తీసుకున్న ప్రామాణికాలు.. ఇలా అనేక సందేహాలు వెంటాడుతున్నాయి. పబ్లిక్ హియరింగ్ సమయంలోనైనా వీటిని యాజమాన్యం నివృత్తి చేస్తుందా, లేదా అన్నది తేలాల్సి ఉంది.


21పిట్ ఏరియా వ్యూ

కనుమరుగైన ఘన చరిత్ర..

సింగరేణి ఆవిర్భావం తర్వాత మొదట ఏర్పాటైందే ఇల్లెందు మండలంలోని 21పిట్ ఏరియా. సింగరేణి తొలినాళ్లలో ఏర్పాటు చేసిన 21పిట్ మైన్‌లో ఈ ప్రాంతం నుంచే కార్మికులు అత్యధిక సంఖ్యలో పనిచేస్తుండడంతో కాలనీకి ఇదే పేరు స్థిరపడింది. వందల సంఖ్యలో కార్మికులు.. వారి కుటుంబాలతో ఒకనాడు 21పిట్ ఏరియా కళకళలాడేది. దీనికి తోడు చిరు వ్యాపారాలు మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్నట్లుగా కొనసాగేవి. ఆ తర్వాత ఇల్లెందు ఏరియాలోని భూగర్భ గనులను మూసివేయడంతో కార్మికులు ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. అరకొరగా ఉన్న కార్మికులను సైతం 21పిట్ భూగర్భ గనిని మూసివేశాక పంపించారు. ప్రస్తుతం రిటైర్డ్ కార్మికుల కుటుంబాలు, సంస్థపై ప్రత్యక్షంగా, పరోక్షంగానూ ఆధారపడి జీవనం సాగించిన కొన్ని కుటుంబాల వారే శిథిలావస్థకు చేరుకున్న క్వార్టర్లలో బతుకు వెళ్లదీస్తున్నారు.

గుర్తింపు ఎలా?

ఓసీ ప్రభావిత కుటుంబాల సంఖ్యను ఎలా గుర్తిస్తారనే మరో ప్రశ్న కూడా స్థానికులను వెంటాడుతోంది. రేషన్‌కార్డులే ప్రామాణికమా, ఇంకా ఏమైనా పరిగణనలోకి తీసుకుంటారా అనే అంశంపై స్పష్టత లేదు. గత పదేళ్ల నుంచి కొత్త రేషన్‌కార్డుల పంపిణీ జరగకపోగా, మార్పులు, చేర్పులకు కూడా ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదు. కానీ ఈ సమయంలో అనేక కొత్త కుటుంబాలు వచ్చి చేరాయి. దీంతో బాధితుల గుర్తింపు ఎలా అనేది తేలాల్సి ఉంది. అంతేకాకుడా సింగరేణి క్వార్టర్లలోనే అత్యధికులు ఉంటుండగా.. వారికి పరిహారం అందుతుందా, లేదా తదితర ప్రశ్నలు అందరి మదిని తొలుస్తున్నాయి.

ప్రజామోదం మేరకే నిర్ణయాలు ఉండాలి



ప్రజామోదం ఉండేలా అధికారుల నిర్ణయాలు ఉండాలి. ప్రతీ కుటుంబానికి మెరుగైన ప్యాకేజీ ప్రకటించాలి. కార్మిక వాడలోని కుటుంబాలకు కూడా మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలి. బ్లాస్టింగ్, కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా జాగ్రతవహించాలి.

– పూనెం కవిత, సర్పంచ్, విజయలక్ష్మినగర్

నిర్వాసితులందరికీ న్యాయం చేయాలి



ప్రభావిత ప్రాంత ప్రజలందరికీ యాజమాన్యం న్యాయం చేయాలి. సొంతింటి యజమానులకు మాదిరిగానే క్వార్టర్లలో నివసిస్తున్న వారికీ ప్యాకేజీ ఇవ్వాలి. జేకే–5 ఓసీ నిర్వాసితుల మాదిరిగా ఉద్యోగావకాశాలు కల్పించాలి. బ్లాస్టింగ్‌తో ఇబ్బంది జరగకుండా చూడాలి.

– ధనసరి స్రవంతి, సర్పంచ్, తిలక్‌నగర్

వలస ఆదివాసీలూ స్థానికులే...

- యాభై ఏళ్లుగా ఉంటున్నందున కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలి
- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు

భద్రాచలంటౌన్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి యాభై ఏళ్ల క్రితం తెలంగాణకు వలస వచ్చి ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న ఆదివాసీలను గుర్తించి ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలు, పోడు హక్కు పత్రాలు మంజూరు చేయాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం చెన్నాపురం గ్రామానికి చెందిన వలస ఆదివాసీలను ఆదుకోవాలనే డిమాండ్‌తో సోమవారం భద్రాచలంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించాక ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ బాపూరావు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా గుర్తించిన మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఐదో షెడ్యూల్డ్ ఆదివాసీలు తెలంగాణలోని ఐదో షెడ్యూల్డ్ భూభాగమైన చర్ల మండలానికి వచ్చి జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం, ఐక్యరాజ్య సమితి ఆదివాసీల హక్కుల ప్రకటన నివేదిక ప్రకారం ఆదివాసీలు వ్యక్తులుగా, సమూహంగా జీవించే హక్కు ఉందని తెలిపారు. కానీ చర్ల మండలంలోని 18 గ్రామాలకు చెందిన సుమారు 4వేల మందికి ఆదివాసీలు రాష్ట్ర ప్రభుత్వం తీరుతో నష్టపోతున్నందున ఇకనైనా హక్కులు కల్పించాలని ఎంపీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చెరుకూరి సతీష్‌కుమార్, గొలకోటి త్రినాథ్‌రావు, సీతయ్య, నాగబాబు, కేటీశ్వరి, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


భద్రాచలంలో ర్యాలీగా వస్తున్న ఎంపీ బాపూరావు, బీజేపీ నాయకులు

రామయ్యను దర్శించుకున్న ఎంపీ

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామిని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు, అధికారులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికి పూజల అనంతరం వేదాశీర్వచనం, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ లింగాల సాయిబాబా, పండితులు లింగాల ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల ఆవాసాల్లో వసతులు కల్పించాలి

ములకలపల్లి: మండలంలోని సీతారాంపురం గ్రామ పంచాయతీ పరిధి ప్రభుత్వ భూమిలో గిరిజనులు గుడిసెలు వేసుకున్న ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు డిమాండ్ చేశారు. గిరిజనుల ఆవాసాన్ని సోమవారం పరిశీలించిన ఆయన గ్రామానికి 'సోయం గంగులుగూడెం'గా నామకరణం చేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నాయకులు సోయం సత్యనారాయణ, ఊకే ముక్తేశ్వరరావు, బాడిశ భిక్షందొర, సోయం చిన్నారి సత్యనారాయణ, పద్దం నాగరాజు, కోండ్రు పద్మ, ఊకే పెద్దమ్మాయి, సడియం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించడంలో కేంద్రం విఫలం

ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

గార్ల: బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఆరోపించారు. గార్లలోని వర్తకసంఘం భవనంలో సోమవారం ఏర్పాటుచేసిన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర విభజన హామీ చట్టంలో పొందుపరిచిన విధంగా అపారమైన ఇనుప ఖనిజ వనరులు ఉన్న బయ్యారంలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాల్సి ఉన్నా కేంద్రం ఆ ఆలోచన చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గడపగడపకూ చేరుతున్నాయన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కాగా, మంగళవారం ఇల్లెందులో జరిగే బీఆర్‌ఎస్ నియోజకవర్గస్థాయి ప్లీనరీకి తరలిరావాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ శివాజీ చౌహాన్, పార్టీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్‌తో పాటు అజ్మీరా బన్సీలాల్, మోతీలాల్, ధరావత్ సక్రు, భారతి, శీలంశెట్టి రమేశ్, రాధాకృష్ణ, బుడిగ మురళి, గాజుల గణేశ్, ఇస్లావత్ రావూజీ, భాస్కర్‌రావు, లింగాల ఉమేశ్, కోట ఉత్తరయ్య, గట్టు అనంతరాములు, రమేశ్, మీగడ శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ